నమస్తే తెలంగాణ
మెదక్
11 | హైదరాబాద్, ఆదివారం 25 ఫిబ్రవరి 2024 | MEDAK

జహీరాబాద్ మండలంలోని కొత్తూర్(బి) గ్రామంలో ఉన్న ట్రైడెంట్ చక్కెర ఫ్యాక్టరీ, పరిశ్రమ గేట్‌కు నోటీసు అంటించిన రెవెన్యూ అధికారులు

28న ట్రైడెంట్ ఆస్తులు వేలం

హైకోర్టు ఉత్తర్వుల మేరకు రెవెన్యూ అధికారుల చర్యలు

రైతులకు రూ.9,01,06,341 కోట్ల బకాయిలు

జహీరాబాద్, ఫిబ్రవరి 24 : హైకోర్టు ఉత్తర్వుల మేరకు జహీరాబాద్ మండలం కొత్తూరు (బీ)లో ఉన్న ట్రైడెంట్ షుగర్స్ ఫ్యాక్టరీ ఆస్తులను వేలం వేసేందుకు రెవెన్యూ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. రెవెన్యూ రికవరీ చట్టం ప్రకారం ఇప్పటికే యాజమాన్యానికి నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. రెవెన్యూ రికవరీ చట్టం WP.NO/229/2024 తేది 4-1-2024 హైకోర్టు ఉత్తర్వుల ప్రకారం 2023 క్రషింగ్ సీజన్‌లో పరిశ్రమకు చెరుకు సరఫరా చేసిన రైతులకు రూ. 9,01,06,341 కోట్లు చెల్లించవలసి ఉందన్నారు. నోటీసులకు ఫ్యాక్టరీ యాజమాన్యం స్పందించకపోవడంతో ఆస్తులను బహిరంగ వేలం వేసేందుకు ప్రభుత్వం నిర్ణయించిందని పేర్కొన్నారు. ఈ నెల 28న ఫ్యాక్టరీకి చెందిన 41.07 ఎకరాల భూమి, యంత్రాలను వేలం వేయనున్నట్లు తెలిపారు.

సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం రఘోత్తంపల్లిలో మహంకాళి దేవాలయంలో ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డిని సన్మానిస్తున్న రెడ్డి సంఘం నాయకులు

రఘోత్తంపల్లి మహంకాళి ఆలయంలో

ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

దుబ్బాక, ఫిబ్రవరి 24: సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం రఘోత్తంపల్లి మహంకాళి దేవాలయంలో ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. మహంకాళి దేవాలయ ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా శనివారం ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డిని దేవాలయ కమిటీ సభ్యులు, రెడ్డి సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ కడతల రవీందర్‌రెడ్డి, ఎంపీటీసీ లక్ష్మీనారాగౌడ్, రెడ్డి సంఘం నాయకులు మోహన్‌రెడ్డి, భూపతిరెడ్డి, రాజిరెడ్డి, దేవిరెడ్డి, రవీందర్‌రెడ్డి, కిషన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పంటలకు నీళ్లందించాలి



చేగుంట: ఇబ్రహీంపూర్ కెనాల్‌ను పరిశీలిస్తున్న దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి తదితరులు

కాల్వల ద్వారా చెరువులు నింపాలి

దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

చేగుంట, ఫిబ్రవరి24: యాసంగి పంటలకు కావాల్సిన సాగునీరు అందించాలని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. మండల పరిధిలోని ఇబ్రహీంపూర్, బోనాల్, కర్నాల్‌పల్లి తదితర గ్రామాల్లో కెనాల్ కాల్వలను ఎమ్మెల్యే శనివారం పరిశీలించారు. చెరువులకు కెనాల్ కాల్వల ద్వారా నీటిని విడుదల చేయాలని, చెరువుల్లో పుష్కలంగా నీళ్లు ఉంటేనే యాసంగి పంటలు పండే అవకాశం ఉందన్నారు. పంటలు ఎండిపోక ముందే నీటిని విడుదల చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ ముదాం శ్రీనివాస్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కోమండ్ల నారాయణరెడ్డి, నాయిని రాజ్‌గోపాల్, మాజీ సర్పంచులు కొటారి అశోక్, నెల్లూర్, మోహన్‌రెడ్డి, సుదర్శనం, అలీ తదితరులున్నారు.

మహ్మదాపూర్‌లో దొరికిన పత్తి విత్తన బస్తాల వద్ద ఎస్సై మహేశ్, టాస్క్‌ఫోర్స్ పోలీసులు

భారీగా నకిలీ పత్తి విత్తనాలు పట్టివేత

రూ.35 లక్షల విలువైన విత్తనాలు సీజ్

హుస్నాబాద్, ఫిబ్రవరి 24: సిద్దిపేట జిల్లాలో భారీగా నకిలీ విత్తనాలు బయటపడ్డాయి. అక్రమంగా నిల్వ ఉంచిన నకిలీ పత్తి విత్తనాలను సిద్దిపేట టాస్క్‌ఫోర్స్, హుస్నాబాద్ పోలీసులు పట్టుకుని సీజ్ చేశారు. హుస్నాబాద్ మండలం మహ్మదాపూర్‌లో ముక్కెర మల్లయ్య అనే వ్యక్తి ఇంట్లో సుమారు రూ.35 లక్షల విలువైన నకిలీ విత్తనాలను పట్టుకున్నారు. 50 కిలోలు ఉండే 26బస్తాలను పోలీసులు గుర్తించారు. హుస్నాబాద్ ఎస్సై తోట మహేశ్ వివరాల ప్రకారం విశ్వసనీయ సమాచారం మేరకు సిద్దిపేట టాస్క్‌ఫోర్స్ పోలీసులు, తాము కలిసి మహ్మదాపూర్‌లోని ముక్కెర మల్లయ్య అనే వ్యక్తి ఇంట్లో సోదాలు చేయగా ఎలాంటి ప్యాకింగ్ లేకుండా, ప్రభుత్వం అనుమతులు లేకుండా ఉన్న పత్తి విత్తనాల బస్తాలు దొరికాయి. వానకాలం ప్రారంభంలో హుస్నాబాద్, అక్కన్నపేట, కోహెడ మండలాలతో పాటు ఇతర జిల్లాల మండలాల్లోని రైతులకు విక్రయించేందుకు రహస్యంగా నిల్వ ఉంచారు. స్వాధీనం చేసుకున్న విత్తన బస్తాలను వ్యవసాయ అధికారులకు అప్పగించారు. వ్యవసాయ అధికారుల ఫిర్యాదుతో పాటు ఇంటి యజమాని ఇచ్చిన వివరాల ప్రకారం నకిలీ పత్తి విత్తనాలను నిల్వ ఉంచిన హన్మకొండ జిల్లా వేలేరు మండల కేంద్రానికి చెందిన పిండి సురేశ్, కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం గాగిరెడ్డిపల్లికి చెందిన సతీశ్ అనే వ్యక్తులపై కేసు నమోదు చేశారు. ఇక్కడైనా ఇలాంటి విత్తనాలు నిల్వ ఉన్నట్లు గానీ, విక్రయాలు జరుగుతున్నట్లు గానీ తెలిస్తే వెంటనే 8712667447, 8712667446 నంబర్లకు ఫోన్ చేయాలని ఎస్సై కోరారు. విత్తనాల దుకాణ యజమానులు ప్రభుత్వం సూచించిన, వ్యవసాయ అధికారులు సర్టిఫై చేసిన విత్తనాలను మాత్రమే విక్రయించాలని, నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

సిద్దిపేట పాల కేంద్రం

సిద్దిపేట జిల్లాలో 350 పాల సేకరణ కేంద్రాలు, 16 మినీ సేకరణ కేంద్రాలు

పాల బిల్లులు చెల్లించేదెప్పుడో?

పెండింగ్‌లో రెండు బిల్లులు

ఇబ్బందులు పడుతున్న రైతులు

సిద్దిపేట/గజ్వేల్, ఫిబ్రవరి 24: ప్రతి పదిహేను రోజులకు ఒకసారి చెల్లించే పాల బిల్లులు చెల్లించడంతో జాప్యం జరుగుతోంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సమయానికి వచ్చిన బిల్లులు ప్రస్తుతం రాకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. విజయ పాలడెయిరీని గత ప్రభుత్వం బలోపేతం చేసే దిశగా అడుగులు వేసింది. దాంతో పాటు రైతులకు అదనంగా లీటర్‌కు రూ.నాలుగు రూపాయలు చెల్లించడంతో ఎంతో ఉత్సాహంగా పాల ఉత్పత్తిపై ఎక్కువ మంది రైతులు ఆసక్తి చూపించారు. కొత్త ప్రభుత్వ ఏర్పాటై రెండు నెలలు గడుస్తున్నా రైతుల నుంచి సేకరించిన పాలకు సకాలంలో బిల్లులు చెల్లించడంలో అధికారులు జాప్యం చేస్తున్నారు. దీంతో పాలను ప్రైవేట్ డెయిరీలకు విక్రయించేందుకు రైతులు ఆసక్తి చూపిస్తున్నారు.

రోజుకు 30 వేల లీటర్ల పాల సేకరణ

సిద్దిపేట జిల్లాలో విజయ డెయిరీ ఆధ్వర్యంలో రోజూ 30వేల లీటర్ల పాలు సేకరిస్తున్నారు. 350 పాల సేకరణ కేంద్రాలు, 16 మినీ సేకరణ కేంద్రాలు ఉన్నాయి. వీటి ద్వారా రోజూ 7200 మంది రైతుల నుంచి విజయ డెయిరీ పాలను సేకరిస్తుంది. సిద్దిపేట విజయ డెయిరీ ఆధ్వర్యంలో సేకరించిన పాలకు చెల్లించాల్సిన బకాయిలు మూడు కోట్ల 55 లక్షలు పెండింగ్‌లో ఉన్నాయి.

గజ్వేల్ విజయపాల డెయిరీ పరిధిలో ..

గజ్వేల్ విజయపాల డెయిరీ పరిధిలో అహ్మదీపూర్, మక్కరాజ్‌పేట, చాట్లపల్లి, కొమురవెల్లి, యాదాద్రి జిల్లా నుంచి కొన్ని గ్రామాల్లోని ఐదు రూట్లలో ప్రతి రోజూ సుమారు 1000 మంది రైతుల నుంచి 3200 లీటర్ల పాలు సేకరిస్తున్నారు. రైతులు పోసిన పాల నుంచి వచ్చే ప్యాట్‌కు అనుగుణంగా ధర నిర్ణయించి చెల్లిస్తున్నారు. దాంతో పాటు గత ప్రభుత్వ హయాంలో కేసీఆర్ ప్రతి లీటర్‌కు నాలుగు రూపాయలు రైతులకు చెల్లించే విధంగా చూశారు. నవంబర్ వరకు నాలుగు వేల లీటర్ల వరకు పాలు సేకరించగా ప్రస్తుతం 3200 లీటర్ల వరకే ఐదు రూట్ల నుంచి పాలను సేకరిస్తున్నారు. పదిహేను రోజులకు ఒకసారి రైతులకు డబ్బులు చెల్లించాల్సి ఉండగా డబ్బులు సకాలంలో చెల్లించకపోవడంతో పాలు పోసేందుకు రైతులు ఆసక్తి చూపించడం లేదని గ్రామాల్లోని పాలు సేకరిస్తున్న నిర్వాహకులు చెబుతున్నారు. గజ్వేల్ పరిధిలోని ఐదు రూట్లలో రెండు విడతలకు సంబంధించి సుమారు రూ.45లక్షల వరకు రైతులకు చెల్లించాల్సిన డబ్బులు పెండింగ్‌లో ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు.

ములుగులో..

ములుగులో ఐకేపీ ద్వారా విజయపాల డెయిరీని నడిపిస్తున్నారు. ఈ కేంద్రానికి వర్గల్, కర్కపట్ల, మర్కూక్ రూట్ల నుంచి పాలు సేకరిస్తున్నారు. ఈ కేంద్రానికి అధికంగా ఆవుపాల సేకరణ జరుగుతున్నది. సుమారు 16వందల మంది రైతుల నుంచి రోజూ 2800 లీటర్ల పాలు సేకరిస్తున్నారు. ఇక్కడ మూడు బిల్లులు పెండింగ్‌లో ఉండగా రెండు రోజుల క్రితమే ఒక విడత బిల్లు రైతులకు చెల్లించారు. మరో రెండు బిల్లులు పెండింగ్‌లోనే ఉన్నాయి. ఈ కేంద్రానికి సంబంధించి సుమారు రూ.35 లక్షల వరకు రైతులకు రావాల్సిన బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. సకాలంలో పాల బిల్లులు రాకపోవడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. కేసీఆర్ ప్రభుత్వంలో సమయానికి వచ్చిన బిల్లులు నేడు రావడం లేదు. దీంతో విజయ డెయిరీకి రైతులు పాలు పోసేందుకు అంతగా ఆసక్తి చూపించడం లేదు. దీంతో పాల సేకరణ తగ్గే అవకాశాలు ఉన్నాయి.

బిల్లులు చెల్లించాలి

కొన్ని సంవత్సరాలుగా పాడి పరిశ్రమ ద్వారా ఉపాధి పొందుతున్నా. రోజూ 25 లీటర్ల పాలు విజయ డెయిరీకి అందజేస్తున్నా. క్రమం తప్పకుండా బిల్లులు రాక చాలా ఇబ్బందులు పడుతున్నాం. ఇప్పటికే రెండు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. బిల్లులు రెగ్యులర్‌గా రాకపోవడంతో పశువులకు అవసరమైన దాణా, ఇతర అవసరాలకు పెట్టుబడి లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వెంటనే బిల్లులు చెల్లించాలి.

– శ్రీనివాస్, పాడి రైతు, మోతే, మిరుదొడ్డి మండలం

బిల్లులు త్వరగా వచ్చేలా కృషి చేస్తున్నాం

రైతులకు రెండు బిల్లులు పెండింగ్‌లో ఉన్న విషయం వాస్తవమే. సుమారు మూడు కోట్ల యాభై ఐదు లక్షల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి.ఈ విషయంపై పాడి సమైఖ్యకు విన్నవించాం. త్వరలోనే బిల్లులు రైతులకు అందేలా కృషి చేస్తున్నాం.

– గోపాల్‌సింగ్, డిప్యూటీ డైరెక్టర్

అక్కన్నపేట: వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణ మహోత్సవ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

కల్యాణ మహోత్సవ

పోస్టర్ ఆవిష్కరణ

అక్కన్నపేట, ఫిబ్రవరి 24: హుస్నాబాద్‌లో రవాణాశాఖ, బీసీ వెల్ఫేర్ మంత్రి పొన్నం ప్రభాకర్ శనివారం ఆయన నివాసంలో కేశవాపూర్ వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణ మహోత్సవ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రధాన అర్చకుడు రమేశాచార్యులు మాట్లాడుతూ మార్చి 8న గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణ మహోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కేడం లింగమూర్తి, బంక చందు, చిత్తారి రవీందర్, డాక్టర్ అక్కు శ్రీనివాస్, పెద్ది రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు 'మల్లన్న'

ఆరో ఆదివారం

చేర్యాల, ఫిబ్రవరి 24: సిద్దిపేట జిల్లాలోని కొమురవెల్లి మల్లన్న బ్రహ్మోత్సవాల్లో నేడు ఆరో ఆదివారం కావడంతో రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు తరలిరానున్నారు. ఆరో ఆదివారం సందర్భంగా వరంగల్, మెదక్, కరీంనగర్, నిజామాబాద్ తదితర పూర్వపు జిల్లాల నుంచి భక్తులు రానున్నట్లు ఆలయవర్గాలు తెలిపాయి. భక్తులు మల్లన్నకు బోనం సమర్పించి పట్నం వేసి మొక్కులు చెల్లించుకోనున్నారు. మరికొందరు భక్తులు మల్లన్నను దర్శనం చేసుకొని, మల్లన్న గుట్టపైన ఎల్లమ్మకు బోనం చేసి మొక్కులు తీర్చుకోనున్నారు. మల్లన్న క్షేత్రంలో మొక్కుల అనంతరం కొండపోచమ్మ, నల్లపోచమ్మ ఆలయాలకు తరలివెళ్లనున్నారు. కొమురవెల్లి మల్లికార్జునస్వామి దర్శనానికి వచ్చే భక్తుల కోసం అన్ని వసతులు కల్పిస్తున్నామని మల్లన్న ఆలయ ఈవో ఎ.బాలాజీ, పునరుద్ధరణ కమిటీ చైర్మన్ పర్పాటకం లక్ష్మారెడ్డి తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇప్పటికే ఐదు ఆదివారాలు ముగిశాయన్నారు. మరో ఆరు ఆదివారాలకు భక్తులు భారీగా తరలిరానుండడంతో ఏర్పాట్లు పూర్తిస్థాయిలో చేస్తున్నట్లు తెలిపారు.

హల్దీవాగు పరవళ్లు

వర్గల్, ఫిబ్రవరి 24: సిద్దిపేట జిల్లా వర్గల్ మండలంలోని నాచగిరి దేవస్థానం వద్ద గల హల్దీవాగు గోదావరి జలాల సవ్వడులతో పరవళ్లు తొక్కుతున్నది. దీంతో నాచగిరిక్షేత్రం లక్ష్మీనృసింహస్వామి దేవతామూర్తుల దర్శనం కోసం వచ్చే భక్తులను గోదావరి జలాలు ఆకట్టుకుంటున్నాయి. హల్దీవాగుపై మత్తడి గలగల పారుతూ ప్రయాణికులను మంత్రముగ్ధుల్ని చేస్తున్నాయి. వాగు పరీవాహక ప్రాంతాల రైతులు కూడా ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇదంతా మాజీ సీఎం కేసీఆర్ సంకల్పించిన జలయజ్ఞానికి ప్రతిఫలంగా ప్రజలు భావిస్తున్నారు.

శనివారం నాచారం వద్ద పరవళ్లు తొక్కుతున్న గోదావరి జలాలు

భక్తులకు ప్రవచనాలు చేస్తున్న మాధవానంద సరస్వతీ స్వామి

భగవంతుడిని భక్తిశ్రద్ధలతో ఆరాధించాలి

మాధవానంద సరస్వతీ స్వామి

ముగిసిన సాయిమందిరం వార్షికోత్సవాలు

పాల్గొన్న దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

చేగుంట, ఫిబ్రవరి24: మండల పరిధిలోని కర్నాల్‌పల్లి సాయిమందిరం వార్షికోత్సవాలు శనివారం ముగిశాయి. ముగింపు కార్యక్రమంలో దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి, మాధవానంద సరస్వతీ స్వామి, విజయవాడ హనుమాన్ పీఠాధిపతి దుర్గాప్రసాద్ స్వామి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మాధవానంద సరస్వతీ స్వామి, దుర్గాప్రసాద్ స్వామి భక్తులకు అనుగ్రహ భాషణం చేశారు. భగవంతుడిని భక్తిశ్రద్ధలతో పూజించాలని ఉపదేశించారు. అనంతరం హోమం, పూర్ణాహుతి శ్రేయసంపాదనం, గురుపాదుక పూజ, ఆశీర్వచన కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు తీర్థ ప్రసాదాలతో పాటు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకుడు అంబటి ఆంజనేయులు, ఆలయ కమిటీ సభ్యులు బచ్చు రమేశ్, యెర్వబాల్ రెడ్డి, కాడిగిద్ద యాదరెడ్డి, తుమ్మయాదగిరి, వంటరి శ్రీనివాస్‌రెడ్డి, రాంరెడ్డి, ఇబ్రహీంపూర్ సొసైటీ చైర్మన్ వంటరి కొండల్‌రెడ్డి, ఇమ్మడి లక్ష్మన్, గోపాల్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, చేగుంట జడ్పీటీసీ ముదాం శ్రీనివాస్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కోమండ్ల నారాయణరెడ్డి, నాయిని రాజ్‌గోపాల్, మాజీ సర్పంచులు కొటారి అశోక్, కుమ్మరి శ్రీనివాస్, నెల్లూర్, బక్కి రమేశ్, ఎర్ర యాదగిరి, సోమ సత్యనారాయణ, మైలరాం రాంచంద్రం, జింక శ్రీనివాస్, బిస్కి సాయికుమార్, అలీతో పాటు వివిధ గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొని మొక్కలు తీర్చుకున్నారు.

సిద్దిపేటలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి రఘురామ్

జాతీయ లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయాలి

సిద్దిపేట జిల్లా ప్రధాన న్యాయమూర్తి రఘురామ్

సిద్దిపేట టౌన్, ఫిబ్రవరి 24: జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని సిద్దిపేట ప్రధాన న్యాయమూర్తి రఘురామ్ అన్నారు. మార్చి 9న జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను పురస్కరించుకొని సిద్దిపేట జిల్లా కోర్టు సమావేశం మందిరంలో శనివారం పోలీస్ శాఖ, న్యాయవాదులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోర్టులో ప్రధానంగా క్రిమినల్, సివిల్, మోటరు వాహనాల కేసులు అధికశాతం పెండింగ్‌లో ఉన్నాయని, వాటి పరిష్కారానికి దృష్టి సారించాలని సూచించారు. జాతీయ లోక్‌అదాలత్‌లో అన్నిరకాల కేసులను రాజీమార్గం ద్వారా పరిష్కరించుకోవచ్చని, ఆ దిశగా న్యాయవాదులు అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో జడ్జీలు స్వాతిరెడ్డి, మిలింద్ కాంబ్లే, చందన, శ్రావణియాదవ్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి, న్యాయసేవ సిబ్బంది మధుసూదన్‌రెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రజల వద్దకే పరిపాలన

- **సిద్దిపేట నూతన కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి**
- **కలెక్టరేట్‌లో బాధ్యతల స్వీకరణ**
- **కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలిపిన పలువురు అధికారులు, సిబ్బంది**

సిద్దిపేట కలెక్టర్ మను చౌదరికి శుభాకాంక్షలు తెలుపుతున్న బదిలీ అయిన కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్

సిద్దిపేట అర్బన్, ఫిబ్రవరి 24: సిద్దిపేట జిల్లా నూతన కలెక్టర్‌గా మిక్కిలినేని మనుచౌదరి శనివారం బాధ్యతలు స్వీకరించారు. సిద్దిపేట కలెక్టరేట్‌కు చేరుకున్న మనుచౌదరికి జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) గరిమాఅగ్రవాల్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీనివాస్‌రెడ్డి, కలెక్టరేట్ ఏవో అబ్దుల్ రెహమాన్ స్వాగతం పలికారు. బదిలీపై వెళ్తున్న కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ నుంచి ఉదయం 11.40 నిమిషాలకు కలెక్టర్‌గా మను చౌదరి బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు జిల్లా అదనపు కలెక్టర్లు, జిల్లా అధికారులు, కార్యాలయ సిబ్బంది నూతన కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మను చౌదరి మాట్లాడుతూ ప్రభుత్వ ముఖ్య పథకాలకు ప్రాధాన్యమిస్తూ పరిపాలనను ప్రజల వద్దకు తీసుకువెళ్లడమే లక్ష్యమన్నారు. ప్రజా వాణి దరఖాస్తులను పూర్తిగా పరిశీలించి వాటిని త్వరగా పరిష్కరించేందుకు సంబంధిత జిల్లా అధికారులతో ప్రత్యేక చర్యలు చేపడుతామన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో సుశిక్షితులైన ఉపాధ్యాయులు, అన్ని మౌలిక వసతులు ఉన్నాయని, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సరైన మోటివేషన్ ఇప్పించి కార్పొరేట్ స్థాయికి మించి ఫలితాలు సాధించేందుకు కృషి చేస్తామన్నారు. జిల్లా స్థాయి టాస్క్‌ఫోర్స్ కమిటీ ఏర్పాటు చేసి భూకబ్జాలు జరుగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. అబ్దుల్ కలాం చెప్పినట్లు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని కష్టపడి కృషిచేస్తే యువత విజయాలు సాధిస్తారని చెప్పారు.



ఎమ్మెల్యే లాస్య నందిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

ఎల్లవేళలా అండగా ఉంటాం

నర్సాపూర్, ఫిబ్రవరి 24: పటాన్‌చెరు ఓఆర్ఆర్‌పై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య నందిత కుటుంబసభ్యులను నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి వారి స్వగృహానికి వెళ్లి పరామర్శించారు. దుఃఖసాగరంలో మునిగిపోయిన వారిని ఓదార్చి ఆత్మస్థైర్యం, ధైర్యాన్ని చెప్పారు. బీఆర్ఎస్ ఎల్లవేళలా అండగా ఉంటుందని తెలిపారు. ఎమ్మెల్యేతో పాటు జడ్పీ కో-ఆప్షన్ మెంబర్ మన్సూర్, మాజీ ఆత్మకమిటీ చైర్మన్ గొర్రె వెంకటరెడ్డి, నియోజకవర్గ ప్రజాప్రతినిధులు ఉన్నారు.